

పారిశుద్ధ్య పనులు పర్యవేక్షణ

ప్రజాశక్తి-నెల్లూరు: నగరవ్యాప్తంగా జరుగుతున్న భూగర్భ డ్రైనేజ్ ఇంటింటి కనెక్షన్, వాటర్ సప్లయ్ పనులను వేగవంతం చేసి, కాలుష్యరహిత నెల్లూరు నగరానికి తోడ్పడాలని కమిషనర్ సూర్య తేజ అధికారులకు సూచించారు. పారిశుద్ధ్య పనుల పర్యవేక్షణలో భాగంగా స్థానిక తొమ్మిదవ డివిజన్ నవాబుపేట, కుసుమ హరిజనవాడ,యనమలపాలెం తదితర ప్రాంతాల్లో జరుగుతున్న భూగర్భ డ్రైనేజ్,వాటర్ సప్లయ్ 49 జోన్లు నందు ఇంటింటి కనెక్షన్ పనులను కమిషనర్ మంగళవారం పర్యవేక్షించారు.కమిషనర్ మాట్లాడుతూ రాష్ట్ర పట్టణ పురపాలక శాఖ మంత్రివర్యులు డాక్టర్. పి. నారాయణ ఆలోచనల మేరకు ప్రజలపై భారం పడకుండా భూగర్భ డ్రైనేజ్ కనెక్షన్లను కేవలం ఒక్క రూపాయికే అందిస్తున్నామని తెలిపారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ విధానంతో దోమలు లేని పర్యావరణహితమైన సుందర నగరాన్ని నిర్మించుకోగలమని కమిషనర్ తెలిపారు. స్థానిక డ్రైవర్స్ కాలనీ, పొట్టి పాలెం మురుగునీటి శుద్ధి కేంద్రాలను కమిషనర్ పర్యటించారు.

ఎపిఐఐసికి 397 ఎకరాలు

కేబినెట్ ఆమోదం - గతంలో ఇచ్చిన భూములకే దిక్కులేదు..

రాష్ట్ర ప్రభుత్వం పారిశ్రామిక అభివృద్ధి పేరుతో ఎపిఐఐసికి భూములు కేటాయించినా ఇప్పటి వరకు ఒక్క మంచి పరిశ్రమ జిల్లాకు రాలేదు. పారిశ్రామికవేత్తలు తీసుకున్న భూములకే దిక్కులేదు. ప్రభుత్వం, పేద, మధ్య తరగతి ప్రజల నుంచి భూములు స్వీకరించి ఎపిఐఐసికి అప్పగించారు. ఆ తర్వాత పరిశ్రమలు వస్తాయని, ఉపాధి, ఉద్యోగాలు వస్తాయని నమ్మబలికినా ఇప్పటి వరకు జిల్లాలో చెప్పుకోదగ్గ ఒక్క పరిశ్రమ కనిపించడం లేదు. సుమారు 80 శాతం భూముల్లో పరిశ్రమలు పెట్టలేదని తెలుస్తోంది. ఇటీవల లీజు విషయంలో అక్రమాలు జరిగాయనే ఆరోపణలున్నాయి. ఈ నేపథ్యంలో మంగళవారం జరిగిన రాష్ట్ర కేబినెట్‌లో జిల్లాలోని ముత్తుకూరు మండలంలో సుమారు 397 ఎకరాలు ఎపిఐఐసి కేటాయిస్తూ క్యాబినెట్ తీర్మానం చేసింది. ఇప్పటికే భూములు తీసుకున్న చోట పరిశ్రమలు ఏర్పాటు చేయకుండా, కొత్తగా మళ్లీ భూములు ఇవ్వడం పట్ల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ప్రజాశక్తి -నెల్లూరు ప్రతినిధి

రాష్ట్ర ప్రభుత్వం పారిశ్రామికాభివృద్ధి పేరుతో దాదాపు 20 ఏళ్ల నుంచి కథలు..కథలు చెబుతొంది. ఒకవైపు భారీ పరిశ్రమల పేరుతో పేద, మధ్య తరగతి ప్రజలు, రైతులు భూములు బలవంతంగా లాకొన్ని పారిశ్రామికవేత్తలకు కట్టబెడు తున్నారు. ఇదిగో, అదిగో అంటూ ఊరిస్తున్నా పరిశ్రమలు రావడం లేదు. ఉన్న పరిశ్రమలే మూతవేసి , భూములు చేతుల్లో పెట్టుకుంటున్నారు. 2004 నుంచి ఇప్పటి వరకు ఉమ్మడి జిల్లా వ్యాపితంగా 60 వేల ఎకరాలు భూమి స్వీకరించారు. అందులో కేవలం 20 శాతం మాత్రమే భూమిని ఉపయోగించారు. అక్కడక్కడ పరిశ్రమలు ఏర్పాటు చేశారు. ఐదు సెజ్లు ఏర్పాటు చేసినా ఆశించిన స్థాయిలో పరిశ్రమలు రాలేదు. పరిశ్రమలు రాని కారణంగా జిల్లా వ్యాపితంగా పెద్ద ఎత్తున నిరుద్యోగం పెరుగుతోంది. కృష్ణపట్నం పోర్టు , పరిసరాల్లో పెద్ద ఎత్తున పరిశ్రమలు వస్తాయని ఒకప్పుడు ఆశ ఉండేది. ఇప్పుడు ఏం కనిపించడం లేదు. కృష్ణపట్నం పోర్టు పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. థర్మల్ ప్రాజెక్టుల కోసం 33 వేల ఎకరాలు భూములు తీసుకున్నారు. అందులో కేవలం 20 శాతం భూముల్లోనూ థర్మల్ ప్రాజెక్టులు రాలేదు. భూములిచ్చిన రైతులు పరిశ్రమలు రాక, పిల్లలకు ఉద్యోగం ఉపాధి, దొరక్క కూలీలుగా మారుతున్నారు. ఇటీవల కోవూరు సుగర్ ఫ్యాక్టరీకి చెందిన 120 ఎకరాలను ఎపిఐఐసికి అప్పగించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. పరిశ్రమలు వచ్చి, నిరుద్యోగ యువతకు ఉపాధి,ఉద్యోగం దొరికితే సంతోషమే, ప్రభుత్వం చిత్తశుద్ధి లేకుండా కేవలం తూతూ మంత్రంగా ఎపిఐఐసిని నడుపుతుందనే విమర్శలున్నాయి. జిల్లాలో ఇప్పటి వరకు ఎపిఐఐసికి కేటాయించిన భూములు, ప్రభుత్వం ఉపయోగించిన భూములు వివరాలు బయటపెట్టాలనే డిమాండ్ ఉంది.

కొత్తగా 397 ఎకరాలు కేటాయింపు..!

రాష్ట్ర క్యాబినెట్ కొత్తగా జిల్లాలో 397 ఎకరాలను ఎపిఐఐసికి కేటాయించింది. మంగళవారం అమరావతిలో జరిగిన సమావేశంలో ఈ మేరకు తీర్మానం చేశారు. ముత్తుకూరు మండలంలోని కృష్ణపట్నం గ్రామంలో ఏర్పాటు చేయనున్న ఇండస్ట్రియల్ పార్కుకోసం 87.56 ఎకరాల ప్రభుత్వ భూమిని ఏపిఐఐసికి ఉచితంగా కేటాయించింది. ముత్తుకూరు మండలం, నేలటూరు గ్రామంలో ఇండస్ట్రీ యల్ పార్క్ నిర్మాణానికి 220.81 ఎకరాలు ప్రభుత్వ భూమిని ఏపిఐఐసికి ఉచితంగా కేటాయిస్తూ నిర్ణయం తీసుకున్నారు. ఈ భూముల కేటాయింపుకు బిఎస్ఓ -24 మరియు జిఓ ఎంఎస్ నెంబర్ 571 రెవెన్యూ (అసెస్-1) డిపార్ట్మెంట్ నిబంధ నలను లోబడి భూములు కేటాయిస్తారు. ఇప్పటి వరకు జిల్లాలో ప్రకటించిన ఇండస్ట్రియల్ పార్కులు ఎన్ని వచ్చాయో ప్రభుత్వం ప్రకటించాల్సి ఉంది. భూములు కేటాయించడం కాకుండా పరిశ్రమలు తీసుకురాడానికి ప్రయత్నాలు చేయాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు.

కార్పొరేషన్ కార్యాలయం ఎదుట

భీష్మించిన కార్మికులు

◆సమస్యల పరిష్కారం కోరుతూ విధులు బహిష్కరణ

◆30 రోజుల్లో పరిష్కరిస్తామని అధికారుల హామీ

కార్పొరేషన్ కార్యాలయం ఎదుట భీష్మించి ధర్నా చేస్తున్న కార్మికులు

ప్రజాశక్తి-నెల్లూరు :తమ సమస్యల పరిష్కారం కోరుతూ నగరపాలక సంస్థలో పనిచేయుచున్న ఆప్కాస్ ఉద్యోగులు ,కార్మికులు మంగళవారం ఉదయం 5:30 గంటల నుంచి విధులు బహిష్కరించి కార్పొరేషన్ కార్యాలయానికి చేరుకుని నిరసన, ధర్నా చేపట్టారు. ప్లకార్డులు, సిఐటియు జెండాలు చేతపట్టు పెద్దఎత్తున నినదించారు. ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఈ నిరసన కార్యక్రమం జరిగింది. ఈ నిరసనను నిలువరించేందుకు కార్పొరేషన్ అధికారులు పోలీసుల సాయంతో సిద్ధమయ్యారు. అధికారులు ఊహించని రీతిలో కార్మికులు తెల్లవారు జామునే కార్పొరేషన్ కార్యాలయం ఎదుట బైఠాయించారు. ఈ సమాచారం తెలుసుకున్న పోలీసులు హుటా హుటిన అక్కడికి చేసుకున్నప్పటికీ నిరసన ధర్నాను నిలువరించలేకపోయారు. భారీగా కార్మికులు కార్పొరేషన్‌కు చేరుకోవడంతో కార్యాలయం కార్మికులతో కిక్కిరిసింది.అధికారులు వచ్చి స్పష్టమైన హామీ ఇచ్చేంత వరకు ఆందోళన విరమించేది లేదంటూ సుమారు 7 గంటల భీష్మించుకు కూర్చున్నారు. మేస్త్రీలు సుమారు 80 మంది ధర్నా శిభిరానికి చేరుకోని కార్మికుల నిరసన ధర్నాకు సంఘీ భావం తెలిపారు. పోలీసుల జోక్యంతో అడిషనల్ కమిషనర్ నందన్ కార్పొరేషన్ కార్యాలయం చేరుకొని యూనియన్ నాయకులు కార్మికులతో సమస్యలపై చర్చ జరిపారు. అనంతరం కమిషనర్ సూర్య తేజతో ఆయన ఛాంబర్ లో సమస్యలపై వివరంగా చర్చ రిపి వివరించారు. సమస్యలు పరిష్కరించేందుకు నెలరోజులు గడువు ఇవ్వాలని అధికారులు కోరడంతో వారు ఇచ్చిన హామీతో నాయకులు ఆందోళన విరమించారు.

యూనియన్ గౌరవ అధ్యక్షులు కత్తి శ్రీనివాసులు మాట్లా డుతూ నగరపాలక సంస్థలో పనిచేయుచున్న ఆప్కాస్ ఉద్యోగులు ,కార్మికుల సమస్యలు పలు దఫాలు అధికారుల దష్టికి తీసుకువచ్చిన ఫలితం లేదన్నారు. 60 ఏళ్ల నిండాయని నెపంతో 93 మంది కార్మికులను ఎటువంటి సమాచారం లేకుండా పనిలో నుంచి ఆపివేయడం సరైన చర్య కాదన్నారు. చనిపోయిన కార్మికుల వారసులకు ఎక్స్రేషియా, ఉద్యోగాలు ఇవ్వలేదన్నారు.చట్ట ప్రకారం అమలు చేయాల్సిన సెలవులు అమలు చేయడం లేదని ఆదేశాలు ఉన్నప్పటికీ అమలు చేయకపోవడం విచారకర మన్నారు.ఇంజనీరింగ్ కార్మికులకు చాలీచాలని జీతాలతో వస్తువులతో జీవిస్తున్నారన్నారు. అధిక వడ్డీలు అప్పులతో అల్లాడుతున్న కార్మికులకు ప్రభుత్వ బ్యాంకుల నుండి రుణాలు మంజూరు చేయించాలని డిమాండ్ చేశారు. ప్రావిడెంట్ ఫండ్ ఈఎస్ఐ సమస్యలు పరిష్కారం కాకుండా అనేక రోజుల నుండి పెండింగ్లో ఉన్నాయని పరిష్కరిం చాలని డిమాండ్ చేశారు. ఇంకా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మాదాల వెంకటేశ్వర్లు, రూరల్ కార్యదర్శి కొండా ప్రసాద్, సిఐటియు నగర కార్యదర్శి జి నాగేశ్వరరావు, రూరల్ కార్యదర్శి కే పెంచల నరసయ్య ప్రసంగించారు సేటు నాయ కులు పి. సూర్యనారాయణ, మాలకొండయ్య, సుధాకర్,మహిళా సంఘం నాయకులు షేక్ మస్తాన్ బి,కత్తి పద్మ, షేక్ షంషాద్, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు అశోక్,మట్టిపాటి శ్రీనివాసులు, కామాక్షమ్మ,దేశ మూర్తి, జై కుమార్, ఆర్ ఎం సునీల్ కుమార్, మనోజ్,తాళ్లూరు రమేష్ ,ప్రవీణ్, ముని మోహన్ బాబు,బాలు, షబ్బీర్, తాళ్లూరి భాగ్యమ్మ, సుజాతమ్మ, వజ్రమ్మ ఉన్నారు.

యూనియన్ నాయకులతో చర్చలు జ రుపుతున్న కమిషనర్

'కాకాణి' చిక్కడం లేదా ? దొంగకు సపోర్టు చేస్తారా ?

ఎంఎల్ఎ సోమిరెడ్డి అగ్రహం

ప్రజాశక్తి -నెల్లూరు ప్రతినిధి :తప్పులు చేయడం, పోలీసులకు చిక్కకుండా పారిపోవడంలో కాకాణి గోవర్ధన్‌రెడ్డికి సర్వసాధారణమని, అంతర్జాతీయ నేరస్తులు దొరుకుతున్నారు...కానీ కాకాణి చిక్కడం లేదని.. తప్పులు చేశాడు కాబట్టే...పిరికిపందలా పారిపోయారని సర్వేపల్లి ఎంఎల్ఎ సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఎద్దేవా చేశారు. కేసులో మంగళవారం కోర్టుకు హాజరైన ఆయన మీడియాతో మాట్లాడారు. కాకాణి లాంటి వ్యక్తి జిల్లా అధ్యక్షులుగా ఉన్నందుకు వైసిపి నేతలందరూ సిగ్గుపడాలన్నారు. కరోనా విపత్తు సమయంలో ఆనందయ్య ఆయుర్వేదం మందును వెబ్ సైట్ ద్వారా అమ్మకానికి ఉంచిన నర్మదరెడ్డిపై. నాపై పెట్టిన కేసుకు సంబంధించి కోర్టుకు హాజరయ్యానన్నారు. అప్పట్లోనే ఆనందయ్యతో పాటు ఆయన కుమారుడు తాము ఆయుర్వేదం మందుకు అమ్మకానికి పెట్టలేదని, ఆ వెబ్ సైట్ తో సంబంధం లేదని ఖండించారని, తనపై నర్మద రెడ్డి చేత కాకాణి గోవర్ధన్ రెడ్డి కష్ణపట్నం పోర్టు స్టేషన్‌లో కేసు పెట్టించారన్నారు. ఇటువంటివి తనపై 18 కేసులు ఉన్నాయి..వాటిలో ఒక కేసును హైకోర్టు క్వాష్ చేసిందన్నారు. మొన్న క్వార్ట్జ్ అక్రమ మైనింగ్ కేసులో అరెస్టు భయంతో నెల్లూరు నుంచి పరారైన తర్వాత హైదరాబాద్ లో మీడియాలో అసభ్యంగా మాట్లాడారన్నారు. ఆనందయ్య ఆయుర్వేదం మందును అమ్మకానికి పెట్టిన సమయంలో నేను మాట్లాడిన ప్రెస్ మీట్ వీడియో మీడియా ప్రతినిధులందరి దగ్గర ఉంది...నేను ఏమైనా తప్పు మాట్లాడానా...చూడాలన్నారు. ఎంఎల్సి చంద్రశేఖర్ రెడ్డి, ఎంపి గురుమూర్తి, మిగిలిన వైసీపీ ఇన్ చార్జిలు, మాజీ ఎమ్మెల్యేలందరికీ ఒక్క మాట చెబుతున్నానని, "కాకాణి వాడే భాషనే మీపై వాడిస్తా... నేనైతే ఆ భాష మాట్లాడలేను..మా నాయకుల్లో ఎవరో ఒకరి చేత మాట్లాడిస్తా.. మీ తల్లిదండ్రులను తిడతారు...ఆయన వాడే దరిద్రుడు వంటి పదాలను వాడుతారు.. అప్పుడు కూడా మీరు చప్పట్లు కొడతారా " అని ప్రశ్నించారు. కాకాణి సొంత మండలం పొదలకూరు.. సొంతూరు తోడేరు పక్కనే వరదాపురం..అక్కడ పట్టపగలే భారీ దోపిడీ చేసి, మైనింగ్ లీజు లేకుండా 14 ప్రొక్లెయిన్లు, 30 డంపర్లు, ఒక గోదాముతో పాటు మరో ట్రక్కులో ప్రమాదకర పేలుడు పదార్థాలు..వందల కోట్ల విలువైన క్వార్ట్జ్ అక్రమ తవ్వకం...ఇవన్నీ కాకాణికి తెలియదంటారా అన్నారు. రెండు బస్సుల్లో హిజ్రాలు, మరో రెండు బస్సుల్లో రౌడీలు వచ్చిన సంగతి కూడా కాకాణికి తెలియదా అన్నారు. కేసులకు బయపడి ఊరు వదలి వెళ్లిపోయారని, తప్పు చేయకపోతే బయటకు రావాలన్నారు.

మాట్లాడుతున్న సోమిరెడ్డి

ప్రమాణాలు పాటించాలి

నెల్లూరు అన్న క్యాంటీన్లలో ప్రభుత్వం సూచించిన నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించి ప్రజలకు అసౌకర్యం కలుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కమిషనర్ సూర్య తేజ నిర్వాహకులను ఆదేశించారు. స్థానిక వెంగళరావు నగర్ అన్న క్యాంటీన్ ను కమిషనర్ మంగళవారం సందర్శించి ప్రజలకు అందుతున్న ఆహార నాణ్యతను పరిశీలించారు. నిర్వాహకులకు సూచనలు చేశారు.

ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటుకు చర్యలు

ప్రజాశక్తి-నెల్లూరు : నగరంలో రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రధాన కూడళ్ల వద్ద ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటుకు త్వరగా చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ కార్తీక్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో రోడ్డు భద్రత కమిటీ సమావేశం జాయింట్ కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. తొలుత రోడ్డు ప్రమాదాల నివారణకు చేపడుతున్న కార్యక్రమాలను ఆర్అండ్‌బి ఎస్ఈ గంగాధర్ కమిటీ సభ్యులకు వివరించారు. జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా రోడ్డు భద్రతా కమిటీ సభ్యులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. నెల్లూరు, ఒంగోలు ఎన్‌హెచ్ఎ పిడిలు ఎం.కె. చౌదరి, ఎం. విద్యాసాగర్, సర్వేల్యాండ్ రికార్డుల ఎడి నాగశేఖర్, డిఎస్పీ జి. శ్రీనివాసరావు, ట్రాఫిక్ సిఐ కె రామకష్ణ, మున్సిపల్ ఎస్ఈలు రామ్మోహన్‌రావు, జానీ ఉన్నారు.

మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్

నేల రాలిన 'మామిడి'

రైతులను నష్టపరిచిన భారీ ఈదురు గాలులు

ప్రజాశక్తి - ఉలవపాడు

అకాల అల్పపీడనం ప్రభావంతో వర్షంతో కూడిన ఈదురు గాలులు ఉలవపాడు మండలంలో బీభత్సం సష్టించాయి. ఎంతో వ్యయ ప్రయాసాలకోర్చి రూ. కోట్లతో తోటలు కొనుగోలు చేసిన మామిడి కౌలు రైతులు రెండు రోజుల కిందట వపాడు మండలంలో ఈదురు గాలులతో కూడిన వర్షానికి చేతికి వచ్చిన కాపు అంతా నేలరాలి తీవ్రంగా నష్టపో యారు. మామిడి కాపును కాపాడుకునేందుకు కౌలు రైతులు లక్షలాది రూపాయలతో చీడపీడలు, తెగుళ్ల సోకకుండా కాపాడుకుంటున్న సమయంలో ఆదివారం అకాల వర్షం, ఈదురుగాలులకు మామిడి తోటలలో కొమ్మలు విరగటం, మామిడి కాయలు నేల నేలరాలడం తో కౌలు రైతు పరిస్థితి దీనంగా మారింది. ప్రతి ఏడాది అక్టోబర్, నవంబర్ మాసాలలో పూతల పూస్తాయి. ఈ ఏడాది కొంత ఆలస్యంగా జనవరి, ఫిబ్రవరి నెలలో పూతలు రావడం, వచ్చిన పూతలను నిలబెట్టుకోవడానికి రైతులు భగీరథ యత్నంతో ఐదు నుంచి పది సార్లు రూ. లక్షలతో మందులు పిచికారి చేయటం పరిపాటిగా మారింది. అదును తప్పించి పూతలు రావడం, దీంతో రైతులు వివిధ రకాల మందులు పిచికారి చేస్తూ జాగ్రత్తగా కాపాడుకుంటూ కాపు చేతికి వచ్చిందనుకున్న సమయంలో ఈదురు గాలులకు కాపు అంతా నేల పాలై రైతుల ఆశలు ఆవిరి అయ్యాయి. దీంతో మామిడి కౌలు రైతుల బాధ వర్ణనాతీతంగా ఉంది. తోటల్లో మిగిలి ఉన్న పిందెలనయినా కాపాడు కుందాం అనుకున్న దశలో వరుణదేవుడు కరుణిస్తాడేమో అనే ఆశతో చూస్తున్న సమయంలో అకాల వర్షం ఈదురు గాలులతో ఒక్కసారిగా మామిడి తోటలపై బీభత్సం సష్టించటంతో కాపు అంతా నేలరాలింది. ఉలవపాడు మండలంలో సుబ్బరాయుడు సత్రం, చాకిచర్ల ప్రాంతాలలోని ఇసుక నేలలలో మామిడి తోటలు 25 శాతం ముందస్తు కాపుకు రావడం జరిగింది. ఈ ప్రాంతంలోనే ఈదురుగాలు వీయటం తోటల్లో కొమ్మలు విరగడం, కాయలు నేల రాలడం జరిగింది. దీంతో నేలరాలిన మామిడి కాయలను కొందరు రైతులు కూలీలతో సేకరించి ఉలవపాడు పచ్చి మామిడి మార్కెట్ కు తరలించి కిలో 4 రూపాయల చొప్పున విక్రయిస్తున్నారు. అయితే నేలరాలిన మామిడి కాయల ఆదాయం చూసి కూలీల డబ్బులు కూడా రావని కౌలు రైతులు వాపోతున్నారు. కొందరు రైతులయితే తోటల్లో చెట్ల కిందనే కాయలను వదిలేశారు. బంగినపల్లి, సువర్ణ రేఖ, నాటు రకాలు కొనే నాథుడు లేక కాయలను తోటల్లోనే పడేసినట్లు రైతులు వాపోతున్నారు. ఒక్క బెంగళూరు రకం కాయలు మాత్రమే పచ్చిమామిడి మార్కెట్ కు ఉపయోగ పడుతుంది తప్ప మరే కాయలు ఉపయోగపడటం లేదని రైతులు పేర్కొన్నారు.

నేలరాలిన కాయలు

ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి- తోటపల్లిగూడూరు :ఉచిత వైద్య శిభిరాలు పేదల పాలిట వరాలు వంటివని, వాటిని గ్రామీణ ప్రాంతాల పేదలు సద్వినియోగం చేసు కోవాలని పంచాయతీ కార్యదర్శి నాదెండ్ల మంజుల పే ర్కొన్నారు. తోటపల్లిగూడూరు మండలం చింతోపు గ్రా మంలో మంగళవారం వెంకటాచలం ఎల్ వి ప్రసాద్ కం టి వైద్యశాల మరియు నెల్లూరు నారాయణ దంత వైద్య శాల విభాగం ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాలు నిర్వ హించారు. టిడిపి నేత మా గుంట రమణారెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు పంచాయతీ కార్యదర్శి మంజుల మాట్లాడు తూ అన్ని రకాల వ్యాధుల నివారణకు ప్రత్యేక వైద్య బందం గ్రామానికి వచ్చి ఉచిత వైద్య శిబిరాలు నిర్వహి స్తున్నట్లు తెలిపారు. నాయకులు దేవరాల ప్రవీణ్, లాలం చంద్రశేఖర్, కోటేశ్వరరావు, ఎల్‌వి ప్రసాద్ కంటి వైద్యశాల సి బ్బంది, ఆప్తోలమిస్ట్ ఎన్. సుమంత్, కో-ఆర్డినేటర్, పి. అనూబ్ బాబు, నేత్ర సిబ్బంది ఎ శిరీష, నారాయణ దంత వైద్య శాల పిఆర్ఓ నరేంద్ర ఉన్నారు

ప్రజాశక్తి -రాపూరు : రాపూరు పట్టణంలోని షాది మంజిల్ లో మంగళవారం పెళ్లకూరు చాగణం లలితమ్మ భాస్కర్ రావు మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో తిరుపతి శ్రీ వెంకటేశ్వర అరవింద్ నేత్రాలయ వారి పర్యవేక్షణలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించినట్లు మేనేజింగ్ ట్రస్టీ గౌరి శంకర్, సీఈవో సీతారామ నాయుడు తెలిపారు. ట్రస్ట్ ఏవో గల్లా. కష్ణ, అరవింద్ నేత్రాలయ సిబ్బంది జీవన్, ఈద్గా కమిటీ మాజీ మెంబర్ షేక్.అహ్మద్ ఉన్నారు.

రాపూరులో..

అపోలో ఆస్పత్రిలో

మోకాలి మార్పిడి శస్త్ర చికిత్సలు

ప్రజాశక్తి-నెల్లూరు :అతి తక్కువ ఖర్చుతోనే రోబోటిక్ సహాయంతో మోకాలి మార్పిడి శస్త్ర చికిత్సలను నిర్వహిస్తున్నట్లు అపోలో స్పెషాలిటీ హాస్పిటల్ వైద్యులు వెల్లడించారు. రోబోటిక్ మోకాలి మార్పిడి ఆపరేషన్లు చేయించుకునే వారికి దానికి అవసరమైన పరీక్షలను ఉచితంగా నిర్వహిం చనున్నట్లు వెల్లడించారు. హాస్పిటల్ లో ఇవాళ జరిగిన పత్రికా విలేకరుల సమావేశంలో అపోలో హాస్పిటల్ డైరెక్టర్ ఆఫ్ మెడికల్ సర్వీసెస్ డాక్టర్ శ్రీరాం సతీష్, ఆర్థోపెడిక్ సీనియర్ సర్జన్లు డాక్టర్ వివేకానంద రెడ్డి , డాక్టర్ శశిధర్ రెడ్డి మాట్లాడారు. రోబోటిక్ మోకాలి మార్పిడి శస్త్ర చికిత్సలను విజయవంతంగా చేయడంలో అపోలో హాస్పిటల్ అగ్రగామిగా ముందుకు వెళుతుందని చెప్పారు. అపోలో హాస్పిటల్ లో అధునాతన విధానంలో రోబోటిక్ సాయంతో మోకాలి మార్పిడి శస్త్ర చికిత్సలను నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. రోబోటిక్ సాయంతో చేసే శస్త్ర చికిత్సలు 100 శాతం ఖచ్చి తత్వంగా ఉంటాయని పేర్కొన్నారు. అతి తక్కువ రక్త స్రావంతో పాటూ శస్త్ర చికిత్సకు సంభందించిన మచ్చలు కూడా ఉండవన్నారు. శస్త్ర చికిత్స తర్వాత నొప్పి కూడా చాలా తక్కువగా ఉంటుందని, వేగంగా కోలుకోవచ్చునని చెప్పారు. శస్త్ర చికిత్స తర్వాత హాస్పిటల్ లో ఎక్కువ రోజులు కూడా ఉండాల్సిన అవసరం లేదని వైద్యులు వెల్లడించారు. అపోలో హాస్పిటల్ ను ప్రారంభించి 10 ఏళ్లు పూర్తయిన సందర్భంగా కేవలం 2లక్షల 50వేల ఫీజుతోనే మోకాలి మార్పిడి శస్త్ర చికిత్సలు నిర్వహిసు న్నామన్నారు. ఉన్న రోగులు సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ శ్రీరాం సతీష్, డాక్టర్ వివేకానంద రెడ్డి , డాక్టర్ శశిధర్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.ఈ విలేకరుల సమావేశంలో వారితో పాటు ఆసుపత్రి యూనిట్ హెడ్ బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న అపోలో వైద్యులు

అనుచిత వ్యాఖ్యలు చేస్తే చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి-నెల్లూరు :వైసిపిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన టిడిపి యాక్టివిస్ట్ లపై చర్యలు తీసుకోవాలని ఆ పార్టీ జిల్లా యువజన విభాగం అధ్యక్షులు కార్పొరేటర్ ఊటుకూరు నాగార్జున, విద్యార్థి విభాగం అధ్యక్షులు ఆశ్రిత్ రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక బాలాజీనగర్ పోలీసు స్టేషన్‌కు చేరుకున్న వైసిపి జిల్లా యువజన విభాగం అధ్యక్షులు, కార్పొరేటర్ ఊటుకూరు నాగార్జున, విద్యార్థి విభాగం అధ్యక్షులు ఆశ్రిత్ రెడ్డి , పోలీసులను కలిసి వైసిపి పై అభ్యంతరకరమైన వ్యాఖ్యలు చేసిన టిడిపి సోషల్ మీడియా యాక్టివిస్ట్ లు సీమరాజా అలియాస్ చంద్రకాంత్ చౌదరి, యాష్ పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ పోలీసులకు మెమొరాడం అందజేశారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడారు.

గర్భిణులు పోషకాహారం తీసుకోవాలి

ప్రజాశక్తి -గుడ్లూరు రూరల్ :మండలంలో తేట్టు సెక్టార్‌లోని స్వర్ణజపురం ఏలూరుపాడు గ్రామంలోని అంగన్‌వాడీ సెంటర్లో పౌష్టికాహార పక్షోత్సవ కార్యక్రమం నిర్వహించారు. మంగ ళవారం జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఉలవపాడు ప్రాజెక్టు సిడిపిఒ అరుణ పాల్గొన్నారు.గర్భిణులు, బాలింతల ఇళ్లను సందర్శించి వారికి పోషకాహారం ఎలా తీసుకోవాలో వివరించారు. తల్లి బిడ్డకు పాలను ఏ విధంగా ఇవ్వాల నేదానిపై అవగాహన కల్పించారు. సిడిపిఒ అరుణ, సూపర్‌వైజర్ కామేశ్వరి, గ్రామ సర్పంచ్ పి .అనిత, అంగన్‌వాడీ కార్యకర్తలు జె .పద్మశ్రీ, ఎస్.ఈశ్వరమ్మ పాల్గొన్నారు

ప్రజాశక్తి-కందుకూరు : కందుకూరు ఐసిడిఎస్ అర్బన్ ప్రాజెక్ట్ బి సెక్టార్ పరిధిలోని అత్తరువారిపాలెం అంగన్వాడీ కేంద్రంలో సిడిపిఒఒ కె సెమిస్టర్ సూచన మేరకు మంగళవారం పోషణ పక్వాడ ప్రోగ్రామ్ జరిగింది. గర్భవతులు, బాలింతలకు 1000 రోజుల సంరక్షణ గురించి తెలిపారు. అన్నప్రాసన, గర్భవతుల నమోదు, గహ సందర్శనలు ఈ సందర్భంగా నిర్వహించారు. పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకోవడంవల్ల కలిగే ప్రయోజనాల గురించి వివరించారు. ఐసిడిఎస్ సూపర్వైజర్ లక్ష్మీదేవి, అంగన వాడీ కార్యకర్తలు కె రహంతునిసా ,ఎస్ కే మై మూన్ ,నసీమా, గుహర్‌జాన్, జరీనా ,రెహానా,ఆశా వర్కర్ శాంతి కుమారి పాల్గొన్నారు.

మురుగు నీరు తొలగించరూ..

ప్రజాశక్తి -సైదాపురం :మండల పరిధిలోని దళితవాడలో మురుగు కాలువ చెత్తతో పూడిపోయి మురుగు నిల్వ చేరి దుర్వాసన వెదజల్లుతోంది. దీంతో ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. మురుగు కాలువ ప్లాస్టిక్ వ్యర్థాలు.. చెత్తతో నిండిపోయింది. మురుగునీరు ముం దుగా కదలక పోవడంతో దుర్గంధం వెదజల్లడం తోపాటు దోమలకు నిలయంగా మారింది. వ్యర్థాలతో కాలువలు నిండి మురుగునీరు పోకుండా ఇళ్ల మధ్యనే ఆగి పోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు చెబుతున్నారు. అధికారులు పాలకులు స్పందించి మురుగునీటి కాలువల్లో పూడిక తీయించాలని స్థానికులు కోరుతున్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు : మండలంలోని కోడూరు పంచాయతీ చెన్నపల్లి పాలెం జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1986 బ్యాచ్ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. అంబేద్కర్ జయంతిని పురస్కరించుకొని చేపట్టిన ఈ ఆత్మీయ సమ్మేళనంలో పూర్వ విద్యార్థుల ఆనంద భాష్పాలతో అలినగనం చేసుకొన్న ఈ అపూర్వ దశ్యం అందరినీ ఎంతగానో ఆకట్టుకొంది. తొలుత అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలవేసి పూర్వ విద్యార్థులు నివాళి అర్పించారు. ఆ బ్యాచ్ గణిత ఉపాధ్యాయుడు మోహన్ ఆధ్వర్యంలో మొత్తం 36 మంది పూర్వ విద్యార్థులను ఆహ్వానించి వారి కుటుంబ సభ్యులతో సహ పాత జ్ఞాపకాలను, అనుభవాలను నెమరువేసుకున్నారు. తెలుగు ఉపాధ్యాయుడు చంద్రశే ఖర్, హిందీ ఉపాధ్యాయిని మీనమ్మ, ప్రధానోపాధ్యా యుడు సాయి ప్రసాద్ లను సన్మానించారు. కార్యక్రమంలో ఆ బ్యాచ్ టాపర్, పాఠశాలకి ఆర్థిక సహాయం చేసిన విజయ్ మోహన్ రెడ్డి, వెంకన్న పాలెం మాజీ సర్పంచ్ ఏసోబు, వ్యాపారవేత్త దయాకర్, ఆ బ్యాచ్ ఎస్.పి.ఎల్ చెంచు నాయుడను ఘనంగా స న్మానించుకున్నారు.

అగ్నిమాపక వారోత్సవాలు

ప్రజాశక్తి- కందుకూరు :అగ్నిమాపక వారోత్సవాలలోభాగంగా రెండో రోజు మంగళ వారం కేసరి గుంట కాలనీ లో డెమో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కాలనీ ప్రెసిడెంట్ నారాయణమ్మ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో అగ్ని మాపక శాఖ కేంద్ర అధికారి బి.వెంకటేశ్వర్లు మాట్లాడారు. వంట చేసేటపుడు ఎలాంటి జాగ్రత్తలను తీసుకోవాలో డెమో కార్యక్రమమును నిర్వహించారు. ఇళ్లలో జరిగే ఎలక్ట్రికల్ ఫైర్స్ గురించి అవగాహన కల్పించారు. ఆర్టీసీ బస్టాండ్ లో కరపత్రాలను పంపిణీ చేశారు.

ప్రజాశక్తి -రాపూరు : అగ్నిమాపక వారోత్సవాలలో భాగంగా రెండో రోజైన మంగళవారం అగ్ని ప్రమాదాల నివారణపై అగ్నిమాపక అధికారి కుప్పయ్య ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన కల్పించారు. అగ్నిమాపకధికారి కుప్పయ్య మాట్లాడుతూ అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు వాటిని ఏ విధంగా నివారించాలో మాక్ డ్రిల్ ద్వారా మల్లమ్మ గుంట, ఆర్టీసీ గ్యారేజ్, బస్టాండ్ లో ప్రజలకు అవగాహన కల్పించడం జరిగిందన్నారు. ్నమాపక సిబ్బంది పాల్గొన్నారు.

శారదకు జాతీయ స్వర్ణ నంది పురస్కారం

ప్రజాశక్తి -నెల్లూరు ప్రతినిధి :ఇందుకూరుపేట మండలం జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల, ఆదెమ్మ సత్రం నందు స్కూల్ అసిస్టెంట్ హిందీ ఉపాధ్యాయురాలుగా పనిచేస్తున్న శ్రీమతి కామంచి శారదకు జాతీయ స్వర్ణ నంది పురస్కారం దక్కింది. సామాజిక,శిఖరం ఆర్ట్ థియేటర్స్ సంస్థ హైదరాబాదు వారు శ్రీ విశ్వా వసు నామ ఉగాది వసంతోత్సవం సందర్భంగా తెలంగాణ మరియు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో విభిన్న రంగాలలో విశిష్ట సేవలు అందించిన ప్రముఖులకు విశ్వావసు ఉగాది జాతీయ స్వర్ణ నంది పురస్కారాలను శ్రీ త్యాగరాయ గాన సభ ప్రధాన వేదిక చిక్కడపల్లి, హైదరాబాదు నందు సోమవారం ప్రదానం చేశారు. భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ సేవకురాలిగా, సాహిత్య, సాంస్కతిక, నత్య, సంగీత రంగాలలో చేస్తున్న విశిష్ట సేవలకు,కనబరచిన విశేష ప్రతిభకు గుర్తింపుగా సంస్థ అధ్యక్షులు కోమటిరెడ్డి గోపాల్ రెడ్డి, సంస్థ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి జి.కష్ణ, ఉప్పల శ్రీనివాస గుప్త, చక్రపాణి, దైవజ్ఞ శర్మ తదితర ముఖ్య అతిధులచే కామంచి శారదకి విశ్వావసు నామ ఉగాది జాతీయస్థాయి స్వర్ణ నంది పురస్కారాన్ని ప్రశంసా పత్రం, శాలువాలతో ఘనంగా సత్కరించి ప్రదానం చేశారు.ఈ సందర్భంగా కవులు రచయితలు, సాహిత్య అభిమానులు కళాకారులు ఉపాధ్యాయులు మిత్రులు శారదకి అభినందనలు తెలిపారు.

శారదకు స్వర్ణ నంది పురస్కారం అందజేస్తున్న దృశ్యం

పగలు వీధి దీపాలు వెలగడంపై

జనం పెదవి విరుపు

ప్రజాశక్తి -గుడ్లూరు రూరల్ :గుడ్లూరు మండల కేంద్రంలో హై స్కూల్ వద్ద పట్ట పగలే వెలుగుతున్న వీధి దీపాలు కనిపించాయి. వీధి దీపాలు లేక చాలా కాలనీలు అంధకారంలో ఉంటే గుడ్లూరు హైస్కూల్ వద్ద పట్టపగలు వీధి దీపాలు వెలుతుండటంపై జనం ఒకింత ఆశ్చర్యం వ్యక్తం చేశారు. గుడ్లూరు హైస్కూల్లో ఉన్న స్తంభాలకు ఉన్నా కరెంటు తీగల పైన చెట్లు ఉండి మంటలు వస్తుంటాయి. సంబంధిత అధికారులు స్పందించి వాటిని సరిచేయాలని కోరుతున్నారు.

మాట్లాడుతున్న ఎంఎల్‌ఎ వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి

యువతకు ఉపాధి కల్పన

ప్రజాశక్తి-బుచ్చిరెడ్డిపాలెం

కోవూరు నియోజకవర్గంలో రాబోవు రోజుల్లో నిరుద్యోగ యువతకు ఉపాధి లభిస్తుందని ఎంఎల్‌ఎ వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి పేర్కొన్నారు. బుచ్చిరెడ్డిపాలెం మండలం నాగమాంబాపురం పంచాయతీ విలియమ్స్ పేటలో 7ఎకరాల 30సెంట్లు భూమిలో నూతన ఆటోనగర్ నిర్మించేందుకు మంగళవారం భూమి పూజ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎంతోకాలంగా బుచ్చిరెడ్డిపాలెం బంగ్లా సెంటర్‌లో జీవనం సాగిస్తున్న మెకానిక్, ఎలక్ట్రిషన్ కార్మికుల కోరిక మేరకు నాగమాంబ పురంలో ఆటోనగర్ ను నిర్మించేందుకు భూమిపూజ చేయడం జరిగిందన్నారు. ఆటోనగర్ ను ఇక్కడ మార్చడం వల్ల బుచ్చిరెడ్డిపాలెంలో ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలగకుండా ఉండడమే కాకుండా నియోజకవర్గ పరిధిలోని యువతకు ఉపాధి లభిస్తుందన్నారు. ఆటోనగర్ కేటాయించిన భూమిలో అక్కడక్కడ గుంతలమయంగా ఉందని, వివిఆర్ ఫౌండేషన్ ద్వారా తమ సొంత నిధులతో మిషనరీల ద్వారా గుంతలను సదును చేస్తామని ఆమె ఇచ్చారు. షుగర్ ఫ్యాక్టరీ రైతాంగానికి కార్మికులకు శాశ్వత పరిష్కారం చూపిస్తామన్నారు. సిఎం చంద్రబాబు నాయుడు జిల్లాలో కోవూరు నియోజకవర్గం డెల్టా ప్రాంతం కావడం వల్ల అధిక శాతంలో ధాన్యాన్ని రైతులు కొనుగోలు చేశారన్నారు. రైతుల ధాన్యానికి మద్దతు ధర కల్పించడమే కాకుండా ధాన్యాన్ని కొనుగోలు చేసిన 24 గంటల్లోనే నగదును రైతుల ఖాతాల్లో జమ చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్ పర్సన్ మోర్ల సుప్రజా, పట్టణ, రూరల్ అధ్యక్షులు ఎం.వి శేషయ్య, బత్తల హరికృష్ణ, తహసిల్దార్ అంబటి వెంకటేశ్వర్లు, ఎంపీడీవో శ్రీహరి, పుట్టా లక్ష్మి సుబ్రహ్మణ్యం నాయుడు, కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యాసామగ్రి పంపిణీ

ప్రజాశక్తి-సంగం

మండలంలోని దువ్వూరు గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు ఇన్ఫినిటీ ఫిన్‌కాప్ సొల్యూషన్ ప్రయివేట్ లిమిటెడ్ నిర్వాహకులు విద్యాసామగ్రి పంపిణీ చేసే కార్యక్రమాన్ని చేపట్టారు. జెడ్‌పి హైస్కూల్, అంగన్‌వాడీ పాఠశాల, ఎంపిపిఎస్ పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులతో కలిసి విద్యార్థులకు లక్షా 50 వేల రూపాయల విలువైన టేబుల్స్, విద్యా సామగ్రి పంపిణీ చేశారు. విద్యార్థులకు విద్యాసామాగ్రి పంపిణీ చేసేందుకు సహకరించిన సంస్థ ఎమ్‌డీ శ్రీకాంత్ రావల్కర్‌కు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో జెడ్‌పి హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వర్లు, ప్రాథమిక పాఠశాల హెడ్మాస్టర్ ప్రసన్నకుమార్, సంస్థ నిర్వాహకులు మోహన్, సురేష్ , విజయ సారథి, శ్రీను, శ్రీకాంత్, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

అంకయ్యకు ఎంఎల్‌ఎ అభినందనలు

ప్రజాశక్తి-కావలి

కావలి రూరల్ మండలం చలంచర్ల గ్రామానికి చెందిన దానం అంకయ్య మంగళవారం కావలి ఎంఎల్‌ఎ దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల జరిగిన ఉగాది పురస్కారాల్లో జానపద రంగంలో విశిష్టమైన కృషి చేసినందుకు అంకయ్య కళారత్న (హంస) అవార్డును మంత్రి కందుల దుర్గేష్, చేతుల మీదుగా అందుకున్నారు. కళారత్న అవార్డును అందుకొని కావలికి కీర్తి ప్రతిష్టలు పెంచిన అంకయ్యను ఎంఎల్ఎ క్రిష్ణారెడ్డి శాలువాతో సత్కరించి, ఘనంగా అభినందించారు. కార్యక్రమంలో గ్రామ నాయకుడు గుర్రం సునీల్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

టిడిపి సభ్యత్వ కార్డులు అందజేత

ప్రజాశక్తి-కావలి

కావలి పట్టణ 34వ వార్డులో 72, 73వ బూత్‌లలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి, మాజీ ఏఎంసి చైర్మన్ మలిశెట్టి వెంకటేశ్వర్లు చేతులమీదుగా సభ్యత్వ కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పట్టణ మాజీ ఉపాధ్యక్షులు ఉసా వెంకట్రావు, మాజీ కౌన్సిలర్ మారిశెట్టి రమేష్, వార్డు ప్రధాన కార్యదర్శి సుందర్ శ్రీనివాస్, 73వ బూత్ ఇన్‌ఛార్జ్ రామయ్య, గూడూరు శ్రీనివాసులు, చేగు శ్రీనివాసులు, శివప్రసాద్, వార్డు ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

ప్రజాశక్తి-ఎఎస్‌పేట

మండల పరిధిలోని స్థానిక వెలుగు కార్యాలయంలో ఎంపిడిఒ, ఎపి సీన్ ఎఫ్ అధ్యక్షతన పొదుపు మహిళలకు, విఒఎలకు ప్రకృతి వ్యవసాయంపై ఖరీఫ్ పంటలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అగ్రికల్చర్ ఆఫీసర్ రజిని, ఎఇఒలు, సిసిలు తదితరులు పాల్గొన్నారు.

అగ్నిమాపక వారోత్సవాలు

ప్రజాశక్తి-వింజమూరు

వింజమూరులో జరుగుతున్న వారోత్సవాల్లో భాగంగా రెండవ రోజు మంగళవారం అగ్నిమాపక సిబ్బంది అగ్ని ప్రమాదాల నివారణపైన బస్టాండ్ సెంటర్, ఆర్‌టిసి సెంటర్ కిరాణా షాపులలో కరపత్రాలు పంపిణీ చేశారు. అనంతరం అగ్ని ప్రమాదాల వల్ల జరిగే నష్టాలను ఎలా ఎదుర్కోవాలి.. తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో అగ్నిమాపక అధికారి ఎం చంద్రమౌళి, సిబ్బంది ఎన్ ప్రభాకర్, పి రమేష్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎపి సిఎన్‌ఎఫ్ డిజిఎం మునిరత్నం

నవధాన్యాలు సాగు చేయాలి

ప్రజాశక్తి-కోవూరు

వరి పంట కోసిన తరువాత నవధాన్యాలను సాగు చేయాల్సిందిగా ఎపి సిఎన్‌ఎఫ్ డిజిఎం మునిరత్నం కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం రైతు సాధికార సంస్థ ఆధ్వర్యంలో 'ప్రజల భాగస్వామ్యంతో ప్రకృతి వ్యవసాయం' అంశంపై జరిగిన సదస్సులో ఆయన మాట్లాడారు. నవధాన్యాలు సాగుచేయడం వల్ల భూమి సారవంతం అవుతుందన్నారు. రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి ప్రకృతి వ్యవసాయాన్ని అలవరచుకోవాల్సిందిగా కోరారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారులు సుజాత, ఇందిరావతి, సుబ్బరాజు, ఉమామహేశ్వరి మాట్లాడారు.

రెడ్‌క్రాస్‌లో రక్తదానం

ప్రజాశక్తి-కావలి

కావలి పట్టణ బిజెపి శాఖ ఆధ్వర్యంలో కావలి ఒకటో పట్టణ అధ్యక్షులు మంద కిరణ్ కుమార్ జన్మదిన సందర్భంగా కావలి రెడ్‌క్రాస్ భవనంలో రక్తదానం నిర్వహించారు. కార్యక్రమంలో కావలి రెడ్ క్రాస్ చైర్మన్ డాకారపు రవి ప్రకాష్, దేవాండ్ల రాకేష్, గుడిపల్లి ప్రసన్న కుమార్, కోడూరు మురళీకృష్ణ, తూమాటి తిరుపతి స్వామి, షేక్ మస్తాన్ భాష, మేదరమెట్ల మణిదీప్, జలదంకి ఎంపిటిసి కుట్టుబోయిన మాధవరావు, వల్లెపు తిరుపతయ్య, రాము యాదవ్, నెల్లూరు సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

పర్మినెంట్ చేయాలని కార్మికుల ధర్నా

ప్రజాశక్తి-కావలి

ధర్నా చేపడుతున్న మున్సిపల్ కార్మికులు

తమను పర్మినెంట్ చేయాలని సిఐటియు ఆధ్వర్యంలో పారిశుద్ధ్య కార్మికులు మంగళ వారం కావలి మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం సిఐటియు నాయకులు పసుపులేటి పెంచలయ్య మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆప్కాస్ రద్దు చేసి, ప్రయివేటు ఏజెన్సీలకు కార్మికులను అప్పగించాలని చూస్తుందని, ఈ ఆలోచనను వెంటనే రాష్ట్ర ప్రభుత్వం విరమించుకోవాలని డిమాండ్ చేస్తున్నామ న్నారు. అప్కాస్ వచ్చిన తర్వాత కార్మికులకు భద్రత, ప్రతినెలా జీతాలు వస్తున్నాయన్నారు. ప్రతినెలా జీతాలు వస్తున్నందున వారి కుటుంబాలకు ఒక వెసులు బాటు కలుగుతుందన్నారు. ఇప్పుడు మళ్లీ అప్కాస్ రద్దు చేసి, ప్రయివేటు ఏజెన్సీలకు అప్పగించాలని రాష్ట్ర ప్రభుత్వం చూడడం కార్మికులను ఇబ్బందులకు గురి చేయడమేనన్నారు. గతంలో ప్రయివేటులో ఉన్నప్పుడు కార్మికులకు సక్రమంగా జీతాలు వచ్చేవి కావన్నారు. పనిభారం ఎక్కువగా ఉండేదన్నారు. పోరాటాలు చేస్తేనే జీతాలు వచ్చేవన్నారు. ఆ విధానం మళ్లీ ఇప్పుడు తీసుకురావాలని రాష్ట్ర ప్రభుత్వం చూడడం చాలా దుర్మార్గమన్నారు. అప్కాస్‌ను రద్దు చేస్తే, కార్మికులను పర్మినెంట్ చేయాలని, రిటైర్మెంట్ వయస్సు 62 సంవత్సరాలకు పెంచాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని కోరారు. రిటైర్డ్ అయిన కార్మికుల కుటుంబాల్లో ఒకరికి పని కల్పించాలని, కార్మికుల సమస్యలు అన్నిటిని పరిష్కరించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. కార్యక్రమం లో సిఐటియు పట్టణ కార్యదర్శి వై.కృష్ణ మోహన్ సిఐటియు నాయకులు జి.మధు సూదనరావు, యూనియన్ అధ్యక్షులు తరక సీనయ్య బిడదల మహేష్, నాయకులు ఎం.బాలయ్య, ఒంగోలు రమేష్, కావలి బాబు, జలదంకి సీనయ్య, మహిళా నాయకులు పరుసు చిన్నమ్మ, లేటు రాజ్యలక్ష్మి, పల్లెపాటి అనిత, అపాటి జ్యోతి, నారాయణమ్మ కార్మికులు పాల్గొన్నారు.

నగదు రికవరీకి ఆదేశాలు

ప్రజాశక్తి-వరికుంటపాడు

మాట్లాడుతున్న డ్వామా పిడి గంగాభవాని

మండలంలో 2023-24 ఆర్థిక సంవత్సరంలో పంచాయతీ రాజ్, హౌసింగ్, ఉపాధిహామీ పథకంలో రూ.11కోట్ల మేర పనులు జరిగాయని, వాటిలో అవకతవకలు జరిగిన నగదు రికవరీకి డ్వామా పిడి గంగాభవాని ఆదేశాలు జారీ చేశారు. గత 15 రోజులుగా ఈ పనులకు సంబంధించి మండలంలోని 24 పంచాయతీలలో సామాజిక తనిఖీ బృందం గ్రామాల్లో తనిఖీలు నిర్వహించారు. ఈ మేరకు మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. ఈ ప్రజావేదికలో డ్వామా పిడి గంగాభవాని మాట్లాడుతూ పంచాయతీల వారీగా గ్రామాల్లో జరిగిన పనులలో అవకతవకలు జరిగినట్లు తనిఖీ బృందం నివేదికలలో వెల్లడించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామాల్లో అవకతవకలకు పాల్పడిన వారిపై రూ.11,18,776 రికవరీ ఆదేశించామన్నారు. అందుకు బాధ్యులైన ఇద్దరు టి.ఎ.లను, ఇ.సి.ని సస్పెండ్ చేసినట్లు డ్వామా తెలిపారు. కార్యక్రమంలో జిల్లా విజిలెన్స్ అధికారి విజయలక్ష్మి , ఎంపిడిఒ వేణు గోపాల్, ఎపిఒ అజాం ఖాన్, టిడిపి మండల అధ్యక్షులు చంద్ర మధుసూదన్ రావు, ఉపాధి హామీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఖరీఫ్ ప్రణాళికపై అవగాహన

ప్రజాశక్తి-మర్రిపాడు

స్థానిక స్త్రీ శక్తి భవన్‌లో ప్రకృతి వ్యవసాయం ఖరీఫ్ ప్రణాళికపై అవగాహన సదస్సును మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఎస్.రామ్మోహన్ పాల్గొని మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ విభాగంలో 2025-26కు సంబంధించి ప్రకృతి వ్యవసాయ ఖరీఫ్ ప్రణాళికలో భాగంగా రైతులందరూ ప్రకృతి వ్యవసాయ విధానాలు పాటించాలన్నారు. ప్రకృతి వ్యవసాయంలో విధివిధానాలను పాటించడం ద్వారా ఆరోగ్యకరమైన ఆహారాన్ని తినగలమని సూచించారు. ఎపిఎం బుజ్జమ్మ మాట్లాడుతూ మహిళా సంఘాల్లో ఉంటూ పొలం కలిగిన రైతులందరూ ప్రకృతి వ్యవసాయం చేయాలని భూమిలేని నిరుపేద కూలీలు ఇంటి వద్ద పెరటి తోటలు వేసుకోవాలని, ఆరోగ్యకరమైన కూరగాయలను పండించుకుని తినాలని తెలిపారు. అనంతరం ప్రకృతి వ్యవసాయ సిబ్బంది మాట్లాడుతూ ప్రీ మాన్సూన్ డ్రై సోయింగ్ ఖరీఫ్ పంటకు ముందు వేయడం ద్వారా నేల సారవంతమై ప్రధాన పంటలకు పోషకాలు అందుబాటులోకి వస్తాయన్నారు. కార్యక్రమంలో అగ్రికల్చర్ విఎఎలు, గ్రామ సంఘాల విఒఎలు, సిబ్బంది పాల్గొన్నారు.

విశ్రాంత హెచ్‌ఎంకు అభినందనలు

ప్రజాశక్తి-ఉదయగిరి

విద్యార్థులకు తరచూ తిథి భోజనం అందిస్తున్న విశ్రాంత ప్రధానోపాధ్యాయుడిని ఎంఇఒ-2 తోట శ్రీనివాసులు అభినందించారు. ఈ సందర్భంగా మంగళవారం స్థానిక మండల పరిషత్ ప్రాదమిక దళితవాడ పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. అనంతరం విద్యాశాఖ అధికారి విద్యార్థుల అభ్యసన పఠన సామర్థ్యాలను పరిశీలించి విశ్రాంత ప్రధానోపాధ్యాయులు ఎస్‌టి హుస్సేనీ (కలీం) కుమారుని పుట్టినరోజు సందర్భంగా విద్యార్థులకు బిరియాని చికెన్ ఫ్రై వడ అరటి పండ్లు అందించిన కలీంని అభినందించి మాట్లాడారు. ప్రధానోపాధ్యాయునిగా పనిచేసిన పాఠశాలలో విద్యార్థులకు తరచూ తిథి భోజనం అందిస్తున్న విశ్రాంత ప్రధానోపాధ్యాయులు కలీంను ఆదర్శంగా తీసుకొని విశ్రాంత ఉపాధ్యాయులు, దాతలు విద్యార్థులకు నాణ్యమైన తిథి భోజనం అందించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు షేక్ షబ్బీర్, ఉపాధ్యాయులు రామకృష్ణారెడ్డి, నరసింహులు పాల్గొన్నారు.

వక్ఫ్‌చట్టాన్ని రద్దు చేయాలని నిరసన

ప్రజాశక్తి-మర్రిపాడు

ఆవాజ్ ఆధ్వర్యంలో నిరసన చేపడుతున్న ముస్లిములు

ముస్లిములకు నష్టం కలిగించే వక్ఫ్ సవరణ చట్టాన్ని రద్దు చేయాలని ముస్లిం సోదరులు మండల ఆవాజ్ కమిటీ ఆధ్వర్యంలో బస్టాండ్ సెంటర్ నుండి తహశీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆవాజ్ జిల్లా కార్యదర్శి షేక్.రషీద్ పాల్గొని మాట్లాడుతూ వక్ఫ్ అమలు చేయడం ద్వారా ముస్లిములకు ఉన్న హక్కులను పూర్తిస్థాయిలో కేంద్ర ప్రభుత్వం హరిస్తుందన్నారు. రాజ్యాంగ స్ఫూర్తికి వ్యతిరేకంగా కేంద్ర ప్రభుత్వం రూపొందించిన వక్ఫ్‌సవరణ చట్టాన్ని ముస్లిములు ఒప్పుకోలేదన్నారు. బిజెపి ప్రభుత్వం ముస్లిములను అణచివేయడానికి వక్ఫ్ చట్టాన్ని సవరణ చేసిందని ఆయన ఆరోపించారు. దర్గాలకు, మసీదులకు దానా ధర్మాలు చేసిన ఆస్తులను దోచుకోవడానికి ప్రధాని మోడీ కుయుక్తులు పన్నారన్నారు. దేశంలో దోచుకోవడానికి ఏమీ ఆస్తులు లేవని ప్రభుత్వ ఆస్తులను కూడా ప్రయివేటు కార్పొరేట్ సంస్థలకు తాకట్టు పెట్టారన్నారు. హిందూ ముస్లింల మధ్య గొడవలు సృష్టించేందుకు కుట్రలు చేస్తున్నారన్నారు. వక్ఫ్ఆస్తులు హిందువులకు సంబంధం లేదని, ప్రతి అంశాన్ని హిందూ - ముస్లిములకు ముడిపెట్టి కేంద్ర ప్రభుత్వం రాజకీయం చేయాలని చూస్తుందని విమర్శించారు. ముస్లిం సోదరులు ఈ కుట్రలను తిప్పి కొట్టాలన్నారు. దేశ స్వాతంత్ర్యం కోసం త్యాగం చేసిన వారిలో ఎక్కువగా ముస్లిములు ఉన్నారు. కార్యక్రమంలో ఎపి రేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మూలివెంగయ్య, ఆవాజ్ మండల ప్రధాన కార్యదర్శి ఎస్డి రహంతుల్లా, అల్లంపాడు మాజీ సర్పంచ్ ఇమామ్ ఖాసిం, మండల ఆవాస్ కమిటీ సభ్యులు, పలు ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

కరెంటు తీగలను సరిచేయండి సారూ..

ప్రజాశక్తి-ఎఎస్‌పేట

విద్యుత్ వైర్లు కిందకు వేలాడుతున్న దృశ్యం

ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన ఖాజా నాయబ్ రసూల్, దొరసానమ్మ వెలసి ఉన్న ఎఎస్‌పేట దర్గా సెంటర్ పరిధిలో విద్యుత్ వైర్లు అస్తవ్యస్తంగా ఉన్నాయని, వాటిని సరిచేయాలని అక్కడ నివాసం ఉండే ప్రజలు పత్రికా ముఖంగా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో దర్గా సెంటర్లో సర్వే నిమిత్తం రోడ్డు వెడల్పు చేసే ప్రయత్నంలో కరెంటు వైర్లు మార్చుటకు గాను, కొత్తగా స్తంభాలను ఏర్పాటు చేయడం జరిగింది. కానీ ఆ వైర్లను కొత్తగా ఏర్పాటు చేసిన స్థంబాలకు ఇంతవరకు బిగించకుండా అతి తక్కువ ఎత్తులో ఉండే పురాతన స్తంభాల మీదనే ఆ వైర్లు నిక్షిప్తం అయి ఉండడం వల్ల, అవి గాలి వచ్చినప్పుడు అటూ ఇటూ ఊగుతున్నాయని ఆ ఏరియాలో వాహనాలు వెళ్ళేటప్పుడు అవి చేతికి అందే విధంగా గందరగోళంగా మారి ఉన్నాయని అక్కడి షాప్ యజమానులు, ఇంట్లో యజమానులు ఏ సమయంలో ఏం జరుగుతుందోనని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రదేశంలో ఎక్కువగా యాత్రికులు వస్తూ ఉంటారని కావున మా మీద దయవుంచి ఆ వైర్లను సరిచేయాలని, అక్కడ ఉన్న గ్రామస్తులైన పటాన్ హుమయున్, షేక్ రహ్మాన్, పి అజీమ్, వార్డ్ మెంబర్ పఠాన్ అలీమ్, పి. జావిద్ తదితరులు కోరుతున్నారు. ఇదే విషయాన్ని సంబంధిత అధికారి అయిన డిఇ కి పలుసార్లు ఫోన్ లైన్‌లో సంప్రదించగా, మెటీరియల్ రావాల్సి ఉందని, వచ్చిన వెంటనే విద్యుత్ లైన్లు ఎత్తులో బిగిస్తామని, చెబుతూ కాలయాపన చేస్తున్నారు.

బియ్యం లారీ పట్టివేత

ప్రజాశక్తి-కోవూరు

కావలి నుంచి చెన్నయ్ నగరానికి వెళ్తున్న బియ్యం లారీని జాతీయ రహదారిపై కోవూరు సమీపంలో పౌర సరఫరాల శాఖ అధికారులు మంగళవారం స్వాధీనం చేసుకున్నారు. పౌర సరఫరాల శాఖ ద్వారా పంపిణీకి సిద్ధమైన బియ్యాన్ని లారీలో తరలిస్తున్నారనే అనుమానంపై అడ్డుకుని పోలీసుస్టేషన్‌కు తరలించారు. అన్ని అనుమతులతో సాధారణ బియ్యాన్ని చెన్నై నగరానికి తీసుకువెళ్తున్నామని లారీ యజమాని వివరించినప్పటికీ బియ్యాన్ని పరీక్షకు పంపారు. ప్రభుత్వం పంపిణీకి సిద్ధం చేసిన బియ్యం కాదని తేలడంతో తాము కేసు నమోదు చేయలేదని ఎఎస్ఐ రషీద్ తెలిపారు. లారీని ఉన్నతాధికారుల విచారణ అనం తరం విడుదల చేయనున్నట్లు వివరించారు.

ఇసుక టిప్పర్ బోల్తా..

ప్రజాశక్తి-వరికుంటపాడు

ప్రమాదవశాత్తు ఇసుక టిప్పర్ బోల్తాపడి ఇసుక మొత్తం నేల పాలైన సంఘటన మండలంలోని కోల్డ్ స్టోరేజీ సమీపంలో మంగళవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. సంగం నుంచి ట్రాక్టర్‌లో ఇసుక మార్కాపురానికి తీసుకు వెళుతుండగా డ్రైవర్ నిద్ర మత్తులోకి జారుకోవడంతో వాహనం అదుపుతప్పి జాతీయ రహదారిపై పడింది. దాంతో ఇసుక చల్లాచెదురుగా పడిపోయింది. ఈ ఘటనలో ఎవరికి ఎటువంటి ప్రమాదం జరగలేదు. పోలీస్, హైవే ఘటనా స్థలానికి చేరుకొని క్రేన్‌తో అన్లోడ్ చేసి ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చేశారు.

చికెన్ వ్యర్థాల వాహనం పట్టివేత

ప్రజాశక్తి-కోవూరు

బెంగళూరు నుంచి కోవూరు పరిసర ప్రాంతా చేపల గుంతల్లో కలిపేందుకు తీసుకువచ్చిన చికెన్ వ్యర్థాల వాహనాన్ని పోలీసులు మంగళవారం స్వాధీనం చేసుకున్నారు. డ్రైవర్‌పై కేసు నమోదు చేశారు. చికెన్ వ్యర్థాలను తరలించే వాహనాలన్నింటినీ స్వాధీనం చేసుకుని కోర్టులో హాజరు పరుస్తామని హెడ్ కానిస్టేబుల్ రషీద్ తెలిపారు.

'శ్రీ చైతన్య' విద్యార్థులకు అభినందనలు

ప్రజాశక్తి-కావలి

'శ్రీ చైతన్య' విద్యార్థులను అభినందిస్తున్న ఎంఎల్‌ఎ క్రిష్ణారెడ్డి

ఇంటర్ ఫలితాలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి, కావలి కీర్తి ప్రతిష్ఠలను పెంచిన "కావలి శ్రీ చైతన్య" జూనియర్ కాలేజీ విద్యార్థులను మంగళవారం ఎంఎల్ఎ దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి ఘనంగా అభినందించారు. అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులు మంగళవారం ఎంఎల్ఎను వారి కార్యాలయంలో కలిశారు. సీనియర్ ఇంటర్ బైపిసిలో పి.కృష్ణసౌజన్య 988 మార్కులతో పట్టణ స్థాయిలో టౌన్‌ఫస్ట్ ర్యాంక్ సాధించిందని, జూనియర్ బైపిసిలో జి.ధనుష్కా 433 మార్కులతో రాష్ట్రస్థాయి ర్యాంక్ సాధించిందని వారిని ముందుగా అభినందించారు. సీనియర్ ఎం.పి.సి.లో యం.శివకృష్ణ 987 ఉత్తమ ర్యాంక్ మార్కులు సాధించాడని, పి.జస్వంత్ 986, పి.హీనా రుక్సర్ 986, పి. సాయి వర్షిణి 985, బైపిసి విభాగంలో ఎన్. నాగచందన 981, సి.ఇ.సి. విభాగంలో ఎన్.పూజిత 944 మార్కులతో పట్టణ ప్రథమ, ద్వితీయ, తృతీయ ర్యాంకులు సాధించారని పేర్కొన్నారు. జూనియర్ ఎం.పి.సి. విభాగంలో ఎస్.డి.సాజిదా 465 మార్కులతో టౌన్ సెకండ్, ఎం.దివ్య వాణి 464, ఆర్. లక్ష్మి సుహిత 463, ఎం. నిషిత 463, బైపిసి విభాగంలో ఎం.నిహిత 427, టి.దీపిక 424, సి.ఈ.సి. విభాగంలో ఎం.రోహితా సంజన 477, ఆర్.హారిక 470 మార్కులతోటౌన్ ప్రథమ, ద్వితీయ, తృతీయ ర్యాంక్‌లు సాధించిన విజేతలను అభినందించారు. ఆయన అభినందించారు. ఇష్టమైన కోర్సు తీసుకొని నచ్చిన వృత్తి ఉద్యోగాలలో రాణించాలని వారిని ఆశీర్వదించారు. విద్యార్థులకు పలు సూచనలు చేశారు. ఉత్తమ ఫలితాలు సాధించడానికి కృషి చేసిన కాలేజీ అధ్యాపకులను, యాజమాన్యాన్ని ఆయన అభినందించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ టి.లుకోధర్, కరెస్పాండెంట్ శ్రీకర్ల వెంకయ్య, డైరెక్టర్లు మట్టా కొండయ్య, పి.వి.ఎస్.ప్రసాద్, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



ఆర్థికసాయం అందజేత

ప్రజాశక్తి-కావలి

కావలి పట్టణం నివాసులు వృత్తి రీత్యా నెల్లూరులో సబ్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న ఒట్టూరు శ్రీనివాసులు తండ్రి ఒట్టూరు.మాలకొండయ్య 5వ వర్ధంతిని పురస్కరించుకుని మంగళవారం కావలి విట్స్ కాలేజీలో ఎం.సి.ఎ. పూర్తి చేసుకోని తన ఒరిజినల్ సర్టిఫికెట్స్ తెచ్చుకోలేక ఆర్థిక ఇబ్బందులు పడుతున్న సాయిప్రియకు తమవంతుగా రూ.10వేలు సంయుక్త సేవా సంస్థ కార్యాలయంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ సీనియర్ సభ్యులు ఎం.వి. ఎన్ ప్రసాద రావు, రిటైర్డ్ ఎస్‌బిఐ చీఫ్ మేనేజర్ ఎం.చంద్రశేఖర్‌లు పాల్గొని సాయిప్రియకు నగదు అందజేశారు. ఈ సందర్భంగా ఎంవిఎన్ ప్రసాద రావు, ఎం చంద్రశేఖర్ మాట్లాడుతూ ఎంసిఎ వరకు చదువుకోని కాలేజీలో ఉన్న తన ఒరిజినల్ సర్టిఫికెట్స్ తెచ్చు కోవడానికి ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న సాయిప్రియకు అండగా నిలిచి, నేడు సంయుక్త సేవా సంస్థ ద్వారా రూ.10 వేలు అందజేసిన ఎస్ఐ ఒట్టూరు శ్రీనివాసులుకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నామన్నారు.

గర్భిణులు పోషకాహారం తీసుకోవాలి

ప్రజాశక్తి-కావలి

సమాజంలో గర్భిణులు, బాలింతలు, పిల్లలు పోషకారం తీసుకొని ఆరోగ్యంగా ఉండాలని, 1000 రోజుల సంరక్షణ, లింగ నిర్ధారణ నిషేధ చట్టం కావలి డివిజన్ కమిటీ సభ్యులు ఎం.మాలకొండా రెడ్డి తెలిపారు. ఈ మేరకు మంగళవారం కావలిలోని ఇస్లాంపేట, జొన్నయిగుంట, గాయత్రి నగర్ అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో పోషకార పక్షోత్సవాలను నిర్వహించారు. కార్యక్రమంలో గర్భిణులు, బాలింతలు, పిల్లలు తీసుకోవాల్సిన ఆహారం గురించి సూపర్‌వైజర్ సుహాసిని వివరించారు. కార్యక్రమంలో ఐ.సి.డి.ఎస్. సూపర్ వైజర్ సుహాసిని, మహిళా పోలీస్ ఏ.శైలజ, పి.శారోన్, ఎన్.పవన కుమారి, ఎఎన్ ఎమ్స్,ఎస్. ఎస్. లారెన్స్, షేక్.మస్ ఫేరిన్, అంగన్‌వాడీ కార్యకర్తలు, తల్లులు పాల్గొన్నారు.



సిఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ

ప్రజాశక్తి-వింజమూరు

వింజమూరులోని తెలుగుదేశం ప్రధాన పార్టీ కార్యాలయంలో మంగళవారం ఎంఎల్‌ఎ కాకర్ల సురేష్ సిఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందజేశారు. మండలంలోని బుక్కాపురం పంచాయతీకి చెందిన స్థానిక గ్రామస్థుడు ఆయన సతీమణి ఎన్నబత్తిన లక్ష్మి ఆరోగ్యం కోసం శక్తికి మించి ఖర్చు చేశారు. అయినప్పటికీ దురదృష్టవశాత్తు ఆమె మరణించింది. వారి కుటుంబానికి అండగా నిలిచేందుకు వైద్యం కోసం ఖర్చులు చేసిన నగదులో కొంత భాగమైన సహాయం చేయాలన్న దృఢ సంకల్పంతో ఎంఎల్‌ఎ రూ.9లక్షల9వేలను మంజూరు చేయించి ఆ చెక్కును బాధితుడికి అందజేశారు.

జనసేన కార్యకర్తకు నివాళులు

ప్రజాశక్తి-కావలి

జనసేన పార్టీ కావలి నియోజక వర్గకార్యాలయంలో ఇన్‌ఛార్జి ఆళహరి సుధాకర్ ఆధ్వర్యంలో మంగళవారం జనసేన కార్యకర్త కోలా కమలేష్‌కు నివాళులర్పించారు. జనసేన పార్టీ కావలి టౌన్ జనసైనికుడు 'కోలా కమలేష్' బైకు ఆక్సిడెంట్ వల్ల ఆకస్మిక మరణం చెందడం తీరని లోటు అని తెలిపారు. వారి కుటుంబానికి మనోధైర్యాన్ని ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు బాలు, మస్తాన్, ఆలా శ్రీనాథ్, కృష్ణయ్య, మురళి, వెంకీ, డా ".రవి, యానాది, రాజేంద్ర ప్రసాద్, నాగరాజు, బాబు, మునితాత, ప్రకాష్, వెంకటేశ్వర్లు, దాసు, ఏడుకొండలు, విజయ్‌పాల్గొన్నారు.

చక్రపాణికి ఎంఎల్‌ఎ అభినందనలు

ప్రజాశక్తి-కావలి

కావలి బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైన కే.చక్రపాణి మంగళవారం కావలి ఎంఎల్‌ఎ దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. చక్రపాణికి ఎంఎల్‌ఎ అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో కావలి బార్ అసోసియేషన్ బాధ్యులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

పలుచోట్ల చలివేంద్రాలు ప్రారంభం

ప్రజాశక్తి-కావలి

కావలి గ్రామీణ నీటి సరఫరా (ఆర్‌డబ్ల్యుఎస్) విభాగం ఆధ్వర్యంలో చలివేంద్రంను ఆ శాఖ కార్యాలయం ముందు డి.ఇ. లీలా ప్రకాష్ మంగళవారం ప్రారంభించారు. ఇప్పటి వరకు గ్రామీణ ప్రాంతాల్లో మంచినీటి సరఫరాకే పరిమితమైన తమ శాఖకు ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ వేసవిలో అవసరమైన చోట ప్రజల సౌకర్యార్థం చలివేంద్రాలను ఏర్పాటు చేయాలని ఆదేశించడంతో తొలి గా కార్యాలయం వద్ద ప్రజా కోసం ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. రోహిణి కార్తెలో కీలక మైన సమయాలలో కొన్ని గంటలు మజ్జిగ ను కూడా అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు. చలివేంద్రం ఏర్పాటును పర్యవేక్షిస్తున్న ఎ.ఇ. సతీష్‌కుమార్ మాట్లాడుతూ ప్రజలు ఇక్కడ ఏర్పాటు చేసిన గ్లాసులను పరిశుభ్రతతో వాడుకోవాలని పరిసరాలు శుభ్రంగా ఉండేలా చూసుకోవాలని కోరారు. ప్రారంభ కార్యక్రమంలో శాఖ సిబ్బంది జయరామయ్య, వేణు, గిరి తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-కావలి : జనసేన పార్టీ కావలి అధికార ప్రతినిధి మన్నెపల్లి రిషికేశ్ జన్మదినం సందర్భంగా మంగళవారం 13వ వార్డ్ ఇన్‌ఛార్జ్ పవన్ ఆధ్వర్యంలో కావలి వైకుంఠపురములో చలివేంద్రం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా ఇన్‌ఛార్జ్ అళహరి సుధాకర్ పాల్గొని ప్రారంభిం చారు. ప్రత్యేక ఆహ్వానితులు ఆత్మకూరు ఇన్‌ఛార్జ నలిశెట్టి శ్రీధర్, సర్వేపల్లి పి.ఎ.సి. సురేష్ , కోవూరు పి.ఎ.సి శ్రీనివాస్ రెడ్డితో కలిసి ప్రారంభించారు. తదుపరి ప్రజలకు మజ్జిగ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎండలు ఎక్కువగా ఉన్నందున పాదచారులకు మజ్జిగ అందించాలని చలివేంద్రాలు ఏర్పాటు చేసిన జనసేన నాయకులకు అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు పోబ్బా సాయివిఠల్, పవన్ కల్యాణ్ ఫాన్స్ అధ్యక్షుడు ఆలా శ్రీనాథ్, నాయకులు దీపూ, మల్లి, టీడీపీ - జనసేన నాయకులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-సంగం : మండలంలోని దువ్వూరు గ్రామంలోని బస్టాండ్ సెంటర్‌లో పంచాయతీ కార్యదర్శి హమీద్ చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ చలివేంద్రాన్ని ఎంపిడిఒ షాలెట్ స్థానిక టిడిపి నాయకులు దయాకర్ గౌడ్, మారెల్ల శ్రీనివాసులు ప్రారంభించారు. వేసవిలో ప్రయాణికులు, ప్రజలు ఇబ్బందులు తలెత్తకుండా జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు చలివేంద్రాన్ని ప్రారంభించామని తెలిపారు. ప్రజలు వేసవిలో జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

In the Court of the IIIrd Addl. District Judge : Nellore

E.P.No. 111 / 2024

O.S.No. 176 / 2018

Anam Venkatarami Reddy - D.H.R

Vs

1. Mahamad Nazeeeruddin Ahamed (Died) and 3 others - J.D.Rs

Notice to 2nd JDR

Mahamad Fatha Ahamad,
S/o **Nazeeruddin Ahamad,**
Residing at D.No. 22-5-75, Kristal School, Near Kanthar Shwali Darga Dadivari Street, Nellore City.

పై నెంబరు కేసులో డిక్రీ హోల్డర్ మీ మీద పై వారి కోర్టులో ఇ.పి. దాఖలు చేసియున్నారు. సదరు ఇ.పి. లో మీకు సేల్ నోటీసు నిమిత్తం **తే02-05-2025ది** కి వాయిదా వేసియున్నారు. కావున వాయిదా రోజు **ఉదయం 10.30 గంటలకు** మీరు స్వయంగా గానీ లేదా వకీలు ద్వారా గానీ పైన తెలిపిన కోర్టులో హాజరై ఆక్షేపణలు తెలుపుకోవలసినది. లేనియెడల కేసు మీ పరోక్షమున తీర్మానించబడును.

వై.వి.సురేష్
డిక్రీ హోల్డర్ తరపు న్యాయవాది, నెల్లూరు.